నేడు యథావిధిగా పిజిఆర్ఎస్

ప్రజాశక్తి - కాకినాడ

ప్రజా సమస్యల పరిష్కారం నిమిత్తం ఏర్పాటు చేయబడిన పిజిఆర్ఎస్ కార్యక్రమం జిల్లా స్థాయిలో సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు అందరూ విధిగా హాజరు కావాలని ఆయన ఆదేశించారు. మండల స్థాయిలో జరిగే పిజిఆర్ఎస్ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు అందరూ విధిగా ఉదయం 9:30 గంటలకు హాజరుకావాలని ఆయన ఆదేశించారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

మతోన్మాద శక్తులపై పోరాడాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు
- ముగిసిన కాకినాడ జిల్లా మహాసభ
- నూతన కార్యదర్శిగా కరణం ప్రసాదరావు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి, పెద్దాపురం

ఆర్ఎస్ఎస్, బిజెపి వంటి మతోన్మాద శక్తులపై పోరాడాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మూడు రోజుల పాటు పెద్దాపురంలో జరుగుతున్న సిపిఎం కాకినాడ జిల్లా మహాసభ ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ప్రతినిధులను ఉద్దేశించి శ్రీనివాసరావు మాట్లాడారు. పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి గోపిమూర్తి గెలుపునకు కృషి చేసిన పార్టీ, ప్రజాసంఘాల నాయకులను అభినందించారు. గ్రాడ్యుయేట్స్ ఎంఎల్‌సి అభ్యర్థిని కూడా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై నిరంతరం రాజీలేని పోరాటాలు చేస్తుంది సిపిఎం మాత్రమే అన్నారు. కార్మిక, కర్షక, ఉద్యోగ, ఉపాధ్యాయ, స్కీం వర్కర్ల సమస్యలపై జిల్లాలో జరిపిన పోరాటాలు, సాధించిన విజయాలను ప్రస్తావించారు. యాజమాన్యాల నుంచి ప్రలోభాలు ఎదురైనా సిఐటియు కార్మికుల పక్షాన నిలబడి చేసిన పోరాటాలను గుర్తు చేశారు. దేశం, రాష్ట్రంలో పెట్టుబడిదారుల ఆదాయం పెరుగుతుందని,ప్రజల ఆదాయాలు పడిపోతున్నాయన్నారు. సగటు వేతనాలు తగ్గిపోతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో కార్మిక వర్గ ప్రయోజనాలే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజలు పెద్ద ఎత్తున నమ్మకం పెట్టుకుని కూటమి ప్రభుత్వాన్ని గెలిపిస్తే, చంద్రబాబు ప్రజలపై భారీగా భారాలు మోపుతున్నారన్నారు. మతోన్మాదం విషయంలో పవన్ కళ్యాణ్ కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. కాకినాడ పోర్ట్ విషయంలో కార్మికుల పొట్టను కొట్టే ప్రయత్నాలు ముమ్మరం అయ్యాయని, దానిని తిప్పికొట్టేందుకు పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

మహాసభలో ప్రతినిధులను ఉద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎవి.నాగేశ్వరరావు మాట్లాడుతూ కాకినాడ జిల్లాలో వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు భద్రత కరువైందన్నారు. కనీస వేతనం అమలు కావట్లేదన్నారు. కౌలు రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారన్నారు. మధ్య తరగతి, చిరు వ్యాపారులు తీవ్ర సమస్యలతో సతమతమవ్వుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో ప్రజల్లోకి వెళ్లి ప్రజాపోరాటాలు నిర్మించాలన్నారు. ప్రజా నాట్యమండలి కళాకారులు ఉద్యమ గీతాలను ఆలపించారు.

:: మహాసభ తీర్మానాలు ::

మహాసభ ఈ సందర్భంగా పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించింది

- అన్నవరం వద్ద విమానాశ్రయాన్ని గురజనాపల్లి సాల్ట్ భూములు లేదా సెజ్ లోని పడావు భూముల్లోకి మార్చాలి
- సబ్ ప్లాన్ గ్రామాలను 5వ షెడ్యూల్లో చేర్చాలి. కొండపోడుడు భూములకు పట్టాలివ్వాలి
- మిడ్డే మీల్స్ వర్కర్లపై రాజకీయ వేధింపులు ఆపాలి. కనీస వేతనం ఇవ్వాలి
- మెట్ట ప్రాంతానికి పూర్తి స్థాయిలో తాగు, సాగు నీరు అందివ్వాలి
- జాతీయ రహదారి 216 నిర్మాణం తక్షణం పూర్తి చేయాలి
- ఇంటింటికీ గ్యాస్‌ను ఉచితంగా అందించాలి
- గ్యాస్ ఆధారిత పరిశ్రమలు నెలకొల్పాలి. పోర్ట్ సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించుకోవాలి
- మహిళలు, బాలికలపై హింస, అత్యాచారాలను అరికట్టాలి
- ప్రభుత్వ విద్యాసంస్థలకు శాశ్వత సొంత భవనాలు నిర్మించి, మౌలిక సదుపాయాలు కల్పించాలి
- మద్యాన్ని నియంత్రించాలి, మత్తు పదార్థాలను నివారించాలి.
- రైతులు పండించిన పంటకు కనీస మద్దతు ధర ఇవ్వాలి.
- కాకినాడ సెజ్‌లో ఖాళీగా ఉన్న భూములు తిరిగి రైతులకు అప్పగించాలి
- ఏలేరు ఆధునికీకరణను తక్షణం పూర్తి చేసి, గండ్లను పూడ్చాలి
- అంటరానితనం నిర్మూలనకు దళితుల సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టాలి.

సిపిఎం జిల్లా నూతన కార్యదర్శిగా కరణం

కరణం ప్రసాదరావు జిల్లా కార్యదర్శి

సిపిఎం కాకినాడ జిల్లా నూతన కార్యదర్శిగా కరణం ప్రసాదరావు ఎన్నికయ్యారు. మహాసభలో భాగంగా నూతన కమిటీని 11 మందితో ఎన్నుకున్నారు. జిల్లా కమిటీ సభ్యులుగా ఎం.రాజశేఖర్, డి.శేషబాబ్జి, జి.బేబిరాణి, కెఎస్.శ్రీనివాస్, పలివెల వీరబాబు, సిహెచ్.రాజకుమార్, టేకుమూడి ఈశ్వరరావు, ఎన్.సూరిబాబు, సిహెచ్.రమణి, జి.వర్మ ఎన్నికయ్యారు.

జి.బేబిరాణి

సిహెచ్.రమణి

డి.శేషబాబ్జి

నూతన కమిటీతో రాష్ట్ర నాయకులు ఎవి.నాగేశ్వరరావు

కెఎస్.శ్రీనివాస్

ఎం.రాజశేఖర్

సిహెచ్.రాజకుమార్

టి.ఈశ్వరరావు

పి.వీరబాబు

ఎన్.సూరిబాబు

మహాసభలో మాట్లాడుతున్న ఎవి.నాగేశ్వరరావు

అధికారులను నిలదీస్తున్న జడ్‌పిటిసి లోవరాజు

సమస్యల పరిష్కారానికి ఫీజులా..?

- అధికారులను నిలదీసిన ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

గ్రామ సభల్లో సమస్యలపై ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తుల పరిష్కారానికి ఫీజులు వసూలు చేయడం ఏమిటి? అని ప్రజా ప్రతినిధులు అధికారులను నిలదీశారు. ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గొల్లప్రోలు మండల బడ్జెట్ సమావేశం ఎంపిపి అరిగెల అచ్చియమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జడ్‌పిటిసి సభ్యులు ఉలవకాయల నాగలోవరాజు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని ఒకవైపు చెబుతూ మరోపక్క ఆ సమస్యల పరిష్కారానికి ఒక్కో దరఖాస్తుకు రూ.550 చొప్పున వసూలు చేయడం ఏమిటి? అని నిలదీశారు. సంపద సృష్టి అంటే ప్రజల సమస్యలను పరిష్కరించడానికి కూడా ఫీజులు వసూలు చేయడమా? అని ప్రశ్నించారు. దీనిపై స్పష్టమైన సమాధానం అధికారులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీనిపై తహశీల్దార్ కెవి.సత్యనారాయణ సమాధానం ఇస్తూ యాప్‌లో వచ్చిందని స్పష్టమైన సమాధానం ఇవ్వకుండానే దాటవేశారు. ఎంపీటీసీలు కంద పేర్రాజు, ఆకుల వెంకటరాజు మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల వద్ద రైతులకు అవసరమైన యూరియ, డిఎపి వంటి ఎరువులు అందుబాటులో లేవని, జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా గొర్రెలు, మేకలకు షెడ్లు నిర్మించడానికి ఎటువంటి పరిశీలన లేకుండా కావలసిన వారికి అనుమతి నిచ్చారని, వాటి తీర్మానాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపిడిఒ కె.స్వప్న ఆధ్వర్యంలో కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ కీర్తి రూ.68,500 మిగులు బడ్జెట్‌ను సమావేశంలో ప్రవేశపెట్టగా సభ్యులు ఆమోదించారు. బడ్జెట్ సమావేశానికి ఆరోగ్య, ఎక్సైజ్ శాఖలకు చెందిన అధికారులు ఎవ్వరూ కన్పించకపోవడంపై పలువురు చర్చించుకున్నారు. తొలుతగా ఇటీవల మృతి చెందిన మాజీ ఎంపిడిఒ హరిప్రియకు సమావేశం నివాళులర్పించింది. ఈ సమావేశంలో తహశీల్దార్ కెవి.సత్యనారాయణ, వైస్ ఎంపిపి బత్తిన మంగ, ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ మానసాదేవి, వివిధ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వేట్లపాలెం ఘటనలో మరో 10 మంది అరెస్ట్

ప్రజాశక్తి - సామర్లకోట

వేట్లపాలెంలో ఇటీవల జరిగిన హత్యోదంతంపై నమోదు అయిన కేసుల్లో పోలీసులు మరో 10 మందిని అరెస్టు చేశారు. ఈ మేరకు సిఐ ఎ.కృష్ణభగవాన్ ఓ ప్రకటనను విడుదల చేశారు. ఇప్పటికే ఈ కేసులో ముగ్గురు మహిళలతో సహా 12 మందిని అరెస్టు చేసిన విషయం విదితమే. ప్రస్తుతం అరెస్టు చేసిన వారితో కలిపి అరెస్టు చేసిన వారి సంఖ్య 22కు చేరింది. తాజాగా అరెస్ట్ అయిన వారిలో బచ్చుల రాజ్‌కుమార్, బచ్చుల చంద్రరావు, గుల్ల సునీల్ కుమార్, సికోటి రాజేంద్రప్రసాద్, గుడాల సన్నీబాబు, బచ్చుల జార్జ్, తోలేటి రాంబాబు, గుడాల వినోద్‌కుమార్, కోళ్ళ రాజు, బచ్చుల లక్ష్మణ్ ఉన్నారు. హుస్సేన్ పురం బాణాసంచా తయారీ కేంద్రం ముద్దాయిలు దాచిన 5 మారణాయుధాలతోపాటు, 5 కర్రలు, ఒక సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు సిఐ తెలిపారు.

ప్రజాశక్తి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి సుభాష్, ఎంఎల్ఎ బండారు సత్యానందరావు, తదితరులు

ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా మీడియా : మంత్రి సుభాష్

ప్రజాశక్తి - కాజులూరు

ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పత్రికలు పని చేయాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. ఆదివారం రామచంద్రపురం విఎస్ఎం కళాశాల ప్రాంగణంలో కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావుతో కలిసి మంత్రి వాసంశెట్టి సుభాష్ 'ప్రజాశక్తి దినపత్రిక 2025' ఏడాది క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పత్రికలు ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా నిలుస్తూ నిత్యం ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కారమే ధ్యేయంగా పని చేయాలన్నారు. అందులో ప్రజాశక్తి దినపత్రికను ప్రత్యేక స్థానం ఉందన్నారు. ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్, డిసిలు లకాల కృష్ణచైతన్య, పేపకాయల నారాయణరావు, కాజులూరు జనసేన యువనాయకులు కూనపురెడ్డి శివకృష్ణ, కోట తాతబ్బాయి, తదితరులు పాల్గొన్నారు.

'వీర్ల బ్రదర్స్' విరాళం

ప్రజాశక్తి - శంఖవరం

అన్నవరం వీర వెంకట సత్య నారాయణ స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి దాతలు వీర్ల బ్రదర్స్ రూ.2, 44,348 విరాళం అందించారు. స్థానిక వ్యాపరస్తులైన వీర్ల బ్రదర్స్ తన తండ్రి సూరిబాబు జ్ఞాపకార్థం ప్రతీ ఏడాది సంక్రాంతి రోజున భక్తులకు అన్నదానం ఏర్పాటు చేయమని, దీనికి సంబంధించి చెక్కును ఆదివారం ఇఒ వీర్ల సుబ్బారావుకి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎసి సిహెచ్.రామ్మోహనరావు, ఎఇఒ కొండలరావు, గుమస్తా విష్ణు పాల్గొన్నారు.

ఇఒకు చెక్కును అందిస్తున్న వీర్ల బ్రదర్స్

ఆరబెట్టుకోలేక..అమ్ముకోలేక...

- సహకరించని వాతావరణం
- చినుకులతో తడుస్తున్న ధాన్యం రాశులు
- అష్టకష్టాలు పడుతున్న అన్నదాతలు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ఖరీఫ్ కష్టాలు రైతులను ఇంకా వెంటాడుతూనే ఉన్నాయి. ఈ ఏడాది సెప్టెంబర్‌లో కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా రైతులు భారీగా నష్టపోయారు. ప్రధానంగా ఏలేరు ఆయకట్ట క్రింద రైతులు సర్వం కోల్పోయారు. తాజాగా బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర అల్పపీడనంతో గత 3 రోజులుగా వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులతో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ఇప్పటికే హెచ్చరించింది. రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా అంతటా ముసురు ఏర్పడింది. అక్కడక్కడా వర్షాలు కురుస్తున్నాయి. కొన్నిచోట్ల మబ్బులు అలుముకున్నాయి. శనివారం కూడా ఇదే పరిస్థితి కొనసాగింది. జిల్లాలో ఇంకా చాలా చోట్ల కోతల పనులు పూర్తి కాలేదు. యంత్రాల సహాయంతో వరి కోతలు ఇంకా జరుగుతూనే ఉన్నాయి. జిల్లాలో ఈ ఏడాది 2.19 లక్షల ఎకరాల్లో వివిధ పంటలను రైతులు సాగు చేశారు. ఇందులో 2.05 లక్షల ఎకరాల్లో వరి సాగు ఉంది. 5.10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లాలో సుమారు 1.85 లక్షల ఎకరాలలో కోతలు పూర్తి అయ్యాయి. ఇంకా 20 వేల ఎకరాల్లో కోతల పనులు జరుగు తున్నాయి. కొన్ని రోజుల తర్వాత అమ్ముకుంటే ధర పెరుగుతుందనే ఆశతో పలువురు రైతులు పంటను కుప్పలుగా వేసి ఉంచారు. దాదా పు 21 వేల మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చే పంట కుప్పలుగా ఉంది.

వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో బరకాలు కప్పి ఉంచిన ధాన్యం

ఆరబెట్టుకునేందుకు అవకాశం లేదు

ఎకరం పంటను సాగు చేయగా మూడు నెలల క్రితం వరదలు వలన నష్టం జరిగింది. కేవలం పది బస్తాలు మాత్రమే దిగుబడి వచ్చింది. అయితే వాతావరణంలో మార్పులు కారణంగా ధాన్యాన్ని ఆరబెట్టుకునే దారి లేదు. తేమ శాతం నిబంధన వలన అమ్ముకుందామంటే అవకాశం లేదు. ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు అక్కరకు రావడం లేదు.

- చెల్లి చినరాములు, రైతులు, గొల్లప్రోలు

బరకాలు కప్పి ఉంచాం

మూడు నెలల క్రితం వచ్చిన వరదల వలన మూడు ఎకరాలకు కేవలం 60 బస్తాలు మాత్రమే దిగుబడి వచ్చింది. మిషన్‌తో కోసిన ధాన్యాన్ని ఆరబెట్టు కోవడానికి వాతావరణం అనుకూలించడం లేదు. నాలుగు రోజులుగా పచ్చిధాన్యాన్ని బరకాలు కప్పి ఉంచాం. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని సేకరించాలి.

- బస్వా గోవిందరాజు, రైతు, గొల్లప్రోలు

కళ్ళాల్లోనే ధాన్యం రాశులు

దాదాపు 90 శాతం కోతలు పూర్తయినప్పటికీ మెట్ట ప్రాంత మండలాల్లో చాలాచోట్ల ధాన్యం రాశులు కళ్ళాల్లోనే ఉండిపోయాయి. సుమారు 15 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం పంట పొలాలు, రహదారుల వెంబడి ఖాళీ స్థలాల్లో ఏర్పాటు చేసుకున్న కళ్ళాల్లోనే ఉండిపోయింది. అయితే అధికారులు మాత్రం 9 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉన్నట్లు చెబుతున్నారు. యంత్రాల ద్వారా కోతలు పూర్తి చేయడంతో తేమ శాతాన్ని తగ్గించేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో అల్పపీడనం ప్రభావంతో 4 రోజులుగా ఆరబెట్టుకునేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఆకాశంలో కారు మబ్బులు అలుముకోవడం, కొన్నిచోట్ల వర్షాలు పడటంతో రైతులు కంటిమీద కునుకు లేకుండా ధాన్యం రాశుల వద్ద కాపలా ఉంటున్నారు. ఓవైపు ఆరబెట్టుకోవడానికి అవకాశం లేక, మరోవైపు అమ్ముకోవడానికి దారి లేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. పిఠాపురం, గొల్లప్రోలు, యు.కొత్తపల్లి, శంఖవరం, తొండంగి తదితర ప్రాంతాల్లో కొన్నిచోట్ల ధాన్యం రాశులు తడిసిపోవడంతో చినుకులు పడుతున్నా ధాన్యాన్ని ఆరబెట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఉన్న ధాన్యాన్ని మిల్లులకు తరలించే ప్రయత్నం చేస్తున్నప్పటికీ తేమ శాతం ఇబ్బందులు వలన రవాణా నిలిచిపోతుంది. ఇదే అదునుగా భావిస్తున్న దళారులు తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ రైతులను మోసగిస్తున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు పూర్తిస్థాయిలో రైతులకు ఉపయోగపడటం లేదు. మరోవైపు పాలకులు తేమశాతం నిబంధనల్లో మార్పులు చేశామని చెబుతున్నప్పటికీ కొనుగోలు కేంద్రాల సిబ్బంది మాత్రం అవేమీ మాకు సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో పలువురు రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో తక్కువ ధరకు ధాన్యాన్ని అమ్ముకుంటున్నారు. మరికొందరు తేమ శాతాన్ని తగ్గించేందుకు తంటాలు పడుతున్నారు.

కార్టూ'నిజం'



జీవిత గమ్యాన్ని రూపొందించేది గణితం

ప్రజాశక్తి - కాకినాడ

జీవిత గమ్యాన్ని రూపొందించేది గణితమే అని జిల్లా సైన్స్ అధికారి ఎం.శ్రీనివాస్ వినీల్ అన్నారు. శనివారం జాతీయ గణిత దినోత్సవాన్ని ఎంఎస్ఎన్ చారిటీస్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాల ఘనం గా నిర్వహించారు. ఈ కార్యక్రమన్ని పాఠశాల విద్యాశాఖ, యంగ్ మైండ్స్, విజ్ఞాన భారతి అధ్వర్యంలో నిర్వ హించారు. విద్యా ర్థులకు గణిత రంగోలి, గణిత క్విజ్ అంశాల్లో పోటీలను నిర్వహించారు. విద్యార్థులు ఉత్సా హంగా వివిధ పోటీలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణితం జీవిత గమ్యాన్ని రూపొందించే శాస్త్రమన్నారు. విద్యార్థులలో గణితం పట్ల ఆసక్తి పెంచి, భయం పోగొట్టడానికి ఇటువంటి కార్యక్రమాలు సహక రిస్తాయని అన్నారు. పాఠశాల హెచ్ఎం ఎంఎస్ .సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గణితం విద్యార్థుల భవిష్యత్తుకు బీజాలు వేసి ఉన్నత స్థాయికి చేర్చు తుందని అన్నారు. యంగ్ మైండ్స్ వ్యవస్థాపక అధ్యక్షులు వాకాడ వెంకటరమణ మాట్లాడుతూ ఈ గణిత పోటీల ద్వారా విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికితీసే ప్రయత్నం అభినం దనీయ మన్నారు. ప్రతి ఒక్కరు గణితం పై ఆసక్తిని పెంచుకోవాలన్నారు. బాలవేదిక జిల్లా కన్వీనర్ నోరి బలరామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులలో నిశిత పరిశీలనా విధానం అవస రమన్నారు. విద్యార్థులు నూతన గణిత ఆవిష్క రణలకు తయారు కావాలని ఆకాంక్షించారు. కౌశల్ జిల్లా సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు క్విజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందజేశారు.

విజేతలకు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుకు వినతిపత్రం ఇస్తున్న దూసర్లపూడి

గ్రేటర్ సిటీ చేసేందుకు సహకరించాలి

ప్రజాశక్తి - కాకినాడ

జిల్లా కేంద్రం కాకినాడను గ్రేటర్ సిటీగా చేసేందుకు సహకరించాలని, అందుకు సిపిఎం రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు కోరారు. పెద్దాపురంలో జరుగుతున్న సిపిఎం జిల్లా మహాసభల సందర్భంగా వచ్చిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావును ఆయన కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూరల్ మండలంలోని తూరంగి, ఇంద్రపాలెం, రమణయ్యపేట, వాకలపూడి, వలసపాకల, చీడిగ, స్వామినగరం, టీచర్స్ కాలనీ మున్నగు విలీన గ్రామాలను గవర్నర్ ఆర్డినెన్సుతో ప్రభుత్వ గెజిట్ ద్వారా 2016లో పంచాయతీరాజ్ నుంచి వేరు చేసిందన్నారు. అయితే రికార్డులు నగర పాలక సంస్థకు అప్పగించక పోవడంతో 2017- 22 ఎన్నికలు 48 డివిజన్లకే పరిమితమై జరిగాయన్నారు. 14 ఏళ్లుగా విలీన గ్రామాలకు ఎన్నికలు లేక రూ.140 కోట్ల నిధులు వెనక్కి పోయాయన్నారు. 159 ఏళ్లుగా కాకినాడ నగర విస్తరణ జరగలేదన్నారు. కావున కాకినాడ కేంద్రాన్ని గ్రేటర్ సిటీగా అప్ గ్రేడ్ చేసే చర్యలు ప్రభుత్వం వహించేలా సిపిఎం కృషి చేయాలని కోరారు.

వేట్లపాలెంలో రీ సర్వే ప్రారంభం

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలోని వేట్లపాలెం గ్రామంలో రీ సర్వే కార్యక్రమానికి ఆదివారం భూమి పూజ చేపట్టి ప్రారంభించారు. వేట్లపాలెం, భీమవరం, జగ్గమ్మగారి పేట గ్రామాల్లో గత ప్రభుత్వంలో చేపట్టిన రీ సర్వే సరిగా జరగలేదని మండల తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖర్ రెడ్డి చెప్పారు. రీసర్వే పున్ణప్రారంభానికి వేట్లపాలెం గ్రామాన్ని పైలెట్ గ్రామంగా ఎంపిక చేసినట్లు చెప్పారు. 24 బృందాలతో 48 మంది సర్వేయర్లు గ్రామంలో రీ సర్వే నిర్వహిస్తారన్నారు. వేట్లపాలెం గ్రామములో మొత్తం గుడికట్టు విస్తీర్ణం 4873.30 సర్వే చేయాల్సి ఉందన్నారు. మండలానికి చెందిన 16 మందితో పాటు పెదపూడి, కాకినాడ రూరల్, కొత్తపల్లి, తొండంగి మండలాలకు చెందిన సర్వేయర్లు డిప్యుటేషన్‌పై ఈ పైలట్ రీ సర్వేలో పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల రీ సర్వే డిటి ఎడ్ల శ్రీనివాస్, మండల సర్వేయర్ సీతారామాచార్యులు, విఆర్ఒలు, సిబ్బంది పాల్గొన్నారు.

రీ సర్వేను పరిశీలిస్తున్న తహశీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి

మరిడమ్మ ఆలయంలో అన్నదానం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మరిడమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం యాత్రికులకు అన్నదానం నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమం సందర్భంగా ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఆదివారం అమ్మవారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే యాత్రికులందరికీ అన్నదానం నిర్వహిస్తున్నామన్నారు.

నేరాలు ఘోరాలు

పశువుల లారీ స్వాధీనం
ఇద్దరు వ్యక్తుల అరెస్టు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

అక్రమంగా తరలిస్తున్న 32 పశువులతోపాటు, వాహనం స్వాధీనం చేసుకుని ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. శనివారం రాత్రి 2 గంటల సమయంలో చెందుర్తి జంక్షన్ వద్ద పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కంటైనర్‌తో వెళ్తున్న లారీని తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో కంటైనర్‌లో 32 పశువులను పోలీసులు గుర్తించారు. పశువులతోపాటు, ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుత్ బైక్ దగ్ధం

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ధర్మవరం గ్రామంలో గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామానికి చెందిన దేవరపల్లి సత్యనారాయణకి చెందిన ఎలక్ట్రికల్ బైక్ ఆదివారం ధర్మవరం గ్రామంలో దగ్ధమైంది. బైక్‌పై వెళ్తుండగా ఒక్కసారిగా పొగలు వచ్చి మంటలు వ్యాపించాయి. విషయం తెలుసుకున్న ప్రత్తిపాడు ఫైర్ స్టేషన్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

పేకాడుతున్న నలుగురి అరెస్టు

ప్రజాశక్తి - చాగల్లు

చిక్కాల గ్రామ శివారులోని ఖాళీ ప్రదేశంలో శనివారం పేకాడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ కె.నరేంద్ర తెలిపారు. వారి వద్ద నుంచి రూ.1,280 నగదు, రెండు సెల్‌ఫోన్లు, పేక ముక్కలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

విఆర్ఎపై ఇసుక మాఫియా దాడి

ప్రజాశక్తి - సీతానగరం

నల్లగొండ గ్రామ నౌకరు ఇసుక మాఫియా ట్రాక్టర్‌తో దాడి చేసిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. ముగ్గళ్ల గ్రామంలో అక్రమ ఇసుక తవ్వకాలు జరుగుతున్న నేపథ్యంలో తహశీల్దారు ఆదేశాల మేరకు ఇసుక ర్యాంపులో అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణా జరగకుండా విఆర్ఎలు విధులు నిర్వహిస్తున్నారు. విఆర్ఎ ముసలయ్య విధులు నిర్వహిస్తుండగా ముగ్గళ్ల గ్రామానికి చెందిన పెనుగుల లక్ష్మణరావు ట్రాక్టర్‌పై అక్రమంగా ఇసుక ర్యాంపు నుంచి ఇసుకను తస్తుండగా ముసలయ్య ట్రాక్టర్ ఆపి వివరాలు అడిగి, పర్మిషన్ తీసుకుని వెళ్లాలి అని చెప్పగా లక్ష్మణరావు ఘర్షణకు దిగాడు. ట్రాక్టర్‌తో ముసలయ్య మీదకు దురుసుగా రావడంతో ఆయన కింద పడిపోగా దెబ్బలు తగిలాయి. దీంతో విఆర్ఎ సీతానగరం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఘనంగా జాతీయ గణిత దినోత్సవం

ప్రజాశక్తి - గండేపల్లి

స్థానిక సూరంపాలెం ప్రగతి ఇంజనీరింగ్ కళాశాల మ్యాథమెటిక్స్ క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు వివిధ అంశాలపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా మ్యాథమెటిక్స్‌లో ప్రతిభకనపరచిన విద్యార్థులకు కళాశాల ఛైర్మన్ డాక్టర్ పరుచూరి కృష్ణారావు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఎంవి.హరనాథ్‌బాబు వైస్ ప్రెశిడెంట్ ఎం.సతీష్, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ కె.సత్యనారాయణ, ప్రిన్సిపల్ డాక్టర్ జి.నరేష్, ఆర్ అండ్ డి డీన్ డాక్టర్ పివిఎస్.మాచిరాజు, వివిధ విభాగాధిపతులు, ఉపాధ్యాయులు, క్లబ్ మెంబర్లు పాల్గొన్నారు.

రిటైర్డ్ విఆర్ఒ ఆకస్మిక మృతి

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

ఉప్పాడ గ్రామ విఆర్ఒగా బాధ్యతలు నిర్వర్తించి పదవీ విరమణ చేసిన బుల్లప్పారావు ఆదివారం మృతి చెందారు. ఆయన మృతికి వివిధ పార్టీ నాయకులు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన కుమారుడు ప్రసాద్ పాత్రికేయునిగా పని చేస్తున్నారు.

కళాకారులకు ఘన సన్మానం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండలం ర్యాలి మ్యాజిక్ హౌస్ వద్ద అనూస్ హో లో ఆదివారం వివిధ కళాకారులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. వారికి ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శ్యామ్ జాదుగర్ మాట్లాడుతూ సాంప్రదా యాలను బతికిస్తున్న కళాకారులను బతికించే బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ సంక్రాంతి సందర్భంగా వారిని అందరూ ఆదుకోవాలని పిలుపు నిచ్చారు. ఫిజియో థెరపిస్ట్ చింతామోహిత్ మాట్లాడుతూ అంతరించి పోతున్న కలలను బతికించు కోవాల్సిన ఆవశ్యకత ఎంతగానో ఉంద అన్నారు. ఈ కార్యక్రమంలో మ్యాజిక్ ఫ్యామిలీ సభ్యులు పాల్గొన్నారు.

సూర్యనారాయణ కుటుంబానికి ఎంఎల్ఎ పరామర్శ

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

ఇటీవల మృతి చెందిన స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ గౌరవ సలహాదారు ఉప్పలగుప్తంకు చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు చిక్కం సూర్యనారాయణ కుటుంబాన్ని ఆదివారం ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావు పరామర్శించారు. ఎంఎల్ఎ ఆనందరావు మాట్లాడుతూ ఉపాధ్యాయుడిగా సుదీర్ఘకాలం పనిచేసిన సూర్యనారాయణ వేలాదిమంది విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్దారని కొనియాడారు. ఉపాధ్యాయ ఉద్యమంలో కీలక పాత్ర వహించారని ఉద్యోగ విరమణ అనంతరం అమలాపురం తాలూకా పెన్షనర్స్ యూనిట్ ఏర్పాటు చేయడంలోనూ పెన్షనర్స్ భవన్ నిర్మాణంలోనూ సూర్యనారాయణ కీలకంగా వ్యవహరించారని అన్నారు. అమలాపురం యూనిట్ జిల్లా బ్రాంచ్ గా అప్ గ్రేడ్ చేయడంలో సూర్యనారాయణ ప్రధాన పాత్ర పోషించారని అన్నారు. అనంతరం సూర్యనారాయణ చిత్రపటానికి ఎంఎల్ఎ ఆనందరావు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుమారుడు సూర్యనారాయణమూర్తి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎంఎల్ఎ వెంట టిడిపి మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ, నాయకులు రవణం మధు, చిక్కం కాసు, గాలిదేవర సురేష్ తదితరులు ఉన్నారు.

ఉత్తీర్ణతా శాతం పెంపు లక్ష్యంగా సంకల్ప్

ఆర్ఐఒ జిఎస్ఎల్‌వి నర్సింహులు

ముఖా ముఖి

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ప్రభుత్వ జూనియర్ కాలేజీలలో ఉత్తీర్ణతా శాతం పెంపు లక్ష్యంగా ప్రభుత్వ ఆదేశాలతో ఇంటర్మీడియెట్ విద్యా మండలి సంకల్ప్-2025 రూపొందించిందని ఆర్ఐఒ నర్సింహులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఇంటర్మీడియెట్ ఫైనల్ పరీక్షల తేదీలను ప్రకటించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ప్రభుత్వ, వివిధ సంక్షేమ, ఎయిడెడ్ యాజామాన్యల పరిధిలో విద్యనభ్యస్తున్న విద్యార్థులు పరీక్షలకు సిద్ధం అవుతున్నారు. ఇంటర్మీడియెట్ విద్యామండలి ప్రకటించిన సంకల్ప్-2025 వివరాలను ఆయన వెల్లడించారు.

జిల్లాలో కళాశాలలు ఎన్ని, ఎంత మంది విద్యార్థులు ఉన్నారు.

జిల్లాలో ప్రభుత్వ, ప్రభుత్వేర కాలేజీలు మొత్తం 125 ఉన్నాయి. వీటిలో ప్రభుత్వ జూనియర్ కాలేజీలు 16, ఎయిడెడ్ 2, సోషల్ వెల్ఫేర్ కాలేజీలు 6తో పాటు హైస్కూల్ ప్లస్ మరో 23 కాలేజీలు కలిపి మొత్తం 47 కాగా మిగిలినవి 78 కాలేజీలు ప్రైవేట్, కార్పొరేట్ కాలేజీలు ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలు నిర్వహిస్తున్నాయి. జిల్లాలో ఇంటర్మీడియెట్ విద్యార్థులు 23,530 మంది విద్యనభ్యసిస్తుండగా, ద్వితీయ సంవత్సరం 20,880 మంది విద్యనభ్యసిస్తున్నారు.

ప్రభుత్వ, ఎయిడెడ్, యాజమాన్యాల పరిధిలో ఎంత మంది

ప్రభుత్వ, ఎయిడెడ్, ఇతర సంక్షేమ విభాగాల నిర్వహణలోని కాలేజీలలో మొత్తం 8,444 మంది విద్యార్థులు ఇంటర్మీడియెట్ విద్యను అభ్యసిస్తున్నారు. వీరిలో ప్రథమ సంవత్సరం ఇంటర్మీడియెట్ విద్యార్థులు 4,733 మంది, ద్వితీయ సంవత్సరం ఇంటర్మీడియెట్ విద్యార్థులు కేవలం 3,711 మంది ఉన్నారు. 2024 మార్చి పరీక్షల ఫలితాల్లో మొదటి సంవత్సరం ఇంటర్మీడియెట్ విద్యార్థులు 75 శాతం మంది పాస్ పర్సంటేజీ నమోదు కాగా, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 85 శాతం సాధించారు. రాష్ట్ర స్థాయిలో జిల్లాకు 5వ స్థానం లభించింది. ఈ విద్యా సంవత్సరం 100 శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా సంకల్ప్ అమలు చేస్తున్నాం.

ఇంటర్మీడియెట్ విద్యార్థుల సిలబస్ పూర్తి చేశారా

ఇంటర్మీడియెట్ విద్యార్థుల సిలబస్ ఈ నెలాఖరు నాటికి పూర్తవుతోంది. ఈ విద్యా సంవత్సరం విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలు అందజేశాము. ప్రతి రోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకూ స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నాము. ప్రతి లెక్చరర్‌కు విద్యార్థులను కేటాయించడంతో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాము. ఉత్తమ ఫలితాలు వస్తాయని ఆశిస్తున్నాము.

సంకల్ప్-2025 ఎలా అమలు చేస్తున్నారు.

తాజా విధానం ప్రకారం కేర్ టేకర్ విధానం అమల్లోకి తెచ్చారు. విద్యార్థులను ఎ, బి, సి కేటగిరీలుగా విభజించారు. బి, సి కేటగిరీ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు జరుగుతున్నాయి. తాజా విధానంతో తరగతుల పని వేళలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటలకు పరిమితం చేశారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ స్టడీ అవర్స్‌గా నిర్వహిస్తున్నారు. ప్రతి లెక్చరర్‌కు కాలేజీలలో విద్యార్థుల సంఖ్య ఆధారంగా కేటాయింపులు చేశాము.

రాజ్యసభ సభ్యుడు సతీష్‌కు ఘనస్వాగతం

ప్రజాశక్తి - ఏలేశ్వరం, గండేపల్లి, ప్రత్తిపాడు

కూటమి తరపున రాజ్యసభకు నియమితులై ప్రమాణ స్వీకార అనంతరం జిల్లాకు విచ్చేసిన సానా సతీష్‌కు ఎర్రవరం గ్రామంలో కూటమి నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ ఆధ్వర్యంలో నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున ఎర్రవరం తరలివచ్చి గజమాలతో ఆయనకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, ఏలేశ్వరం ఎంపిపి గొల్లపల్లి బుజ్జి, టిడిపి నాయకులు అలమండ చలమయ్య, బొదిరెడ్డి గోపి, బస ప్రసాద్, మైరాల కనకారావు, మూది నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు. అలాగే గండేపల్లి మండలం మురారి గ్రామంలో ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ, టిడిపి జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో ఎంపి సానా సతీష్‌కు ఘనంగా స్వాగతం పలికారు. పలు గ్రామాల్లో కూటమి నాయకు లు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మురారి గ్రామ ఉప సర్పంచ్ జాస్తి వసంత్, ఉప్పలపాడు గ్రామానికి చెందిన పెమ్మన బోయిన వరప్రసాద్ ఎంపిని సానా సతీష్‌ను గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు పోతుల మోహనరావు, టిడిపి నాయకులు కోర్పు లచ్చయ్యదొర, కోర్పు సాయితేజ, పరిమి బాబు, అడబాల భాస్కరరావు, కందుల చిట్టిబాబు, కుంచే రాజా, అడబాల ఆంజనేయులు, దొమ్మ శ్రీను, తోరాటి వెంకన్న, శీలామతుల వీరబాబు, బలిరెడ్డి గంగరాజు, సూరంపాలెం బాలు, రామకుర్తి నరసింహ పాల్గొన్నారు. ప్రత్తిపాడులో ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ ఆధ్వర్యంలో రాజ్యసభ సభ్యులు సానా సతీష్‌కు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ నాపై అభిమానంతో నాయకులు, కార్యకర్తలు అభిమానులు చూపించిన అభిమానం మరువలేనిదన్నారు. ఎంఎల్ఎ సత్యప్రభ మాట్లాడుతూ ప్రత్తిపాడు నియోజకవర్గంలో సానా సతీష్ చేసిన సేవలు మరవలేనివని కొనియాడారు. ఈ కార్య క్రమంలో టిఎన్‌టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు వెన్నా శివ, కొమ్ముల కన్నబాబు, యాళ్ళ జగదీష్, అమరాది వెంకట్రావు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గండేపల్లిలో ఎంపి సానా సతీష్‌కు స్వాగతం పలుకుతున్న జ్యోతుల నవీన్, తదితరులు

మాజీ సర్పంచ్ సోమరౌతు మృతి

ప్రజాశక్తి - రౌతులపూడి

మండలంలోని బలరామ పురం మాజీ సర్పంచ్ సోమరౌతు భాస్కర వెంకన్న దొర (71) ఆదివారం మృతి చెందారు. సర్పంచ్‌గా, ఎంపిటిసి సభ్యునిగా, సొసైటీ అధ్యక్షులుగా ప్రజలకు సేవలందించారు. మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం, మాజీ ఎంఎల్ఎలు వరుపుల సుబ్బారావు, పర్వతా శ్రీ పూర్ణచంద్ర ప్రసాద్‌కు ఆయన సన్నిహితంగా ఉండేవారు. వెంకన్నదొర మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. ఆయన మృతి చెందిన సమాచారాన్ని తెలుసుకున్న ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు ఆయన స్వగృహానికి చేరుకున్నారు. ఆయన పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శంఖవరం ఎంపిపి పర్వత రాజబాబు కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

ఘనంగా అమ్మవారి రథోత్సవం

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట బళ్ల మార్కెట్ సెంటర్‌లోని గ్రామ దేవత కనక మహా లక్ష్మీ అమ్మవారి రథోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గరగ నృత్యాలు, పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, యాత్రికులు పాల్గొన్నారు.

అమ్మవారిని ఊరేగిస్తున్న నిర్వాహకులు

ఉత్కంఠ భరితంగా మార్నింగ్ స్టార్స్ షటిల్ టోర్నీ

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ ఆఫీసర్స్ క్లబ్ మార్నింగ్ స్టార్స్ షటిల్ టోర్నీ ఉత్కంఠ భరితంగా ఆదివారం సాగింది. రెండు రోజులుగా సాగిన ఈ టోర్నీలో 15 జట్లు పాల్గొన్నాయి. ఈ టోర్నీలో పాల్గొన్న క్రీడాకారులు తమ ప్రతిభను కనబరిచి విజేతలుగా నిలిచారు. విజేతలకు బహుమతులను ఆగస్త్య విద్యా సంస్థల అధినేత డి.నాగేశ్వరరావు అందజేశారు. టోర్నీలో పాల్గొన్న క్రీడాకారులు అందరికీ షీల్డులు, టీ షర్ట్స్ అందజేయడంతోపాటు విన్నర్స్, రన్నర్స్‌కు షటిల్ బ్యాట్లు, కప్‌లను అందజేశారు. టోర్నీలో విన్నర్స్‌గా తాతాజీ, లోకేష్, రన్నర్స్‌గా షాలేమ్, లక్ష్మీరెడ్డి, మూడో స్థానంలో బి.శ్రీనివాస్, రమేష్, నాలుగో స్థానంలో కృష్ణంరాజు, వి.నవీన్ నిలిచారు. ఈ కార్యక్రమంలో టోర్నీ నిర్వాహకులు రామకృష్ణ, హరి, క్రీడాకారులు భాస్కర్, రమణ, దిండి శ్రీనివాస్, రాజేష్, శేఖర్ పాల్గొన్నారు.

బహుమతులు అందుకున్న క్రీడాకారులు

ఘనంగా సూర్యారావు జయంతి

ప్రజాశక్తి - కాకినాడ

ది యంగ్‌మెన్స్ హ్యాపీ క్లబ్ పూర్వ అధ్యక్షులు, దంటు కళాక్షేత్రం వ్యవస్థాపకులు దంటు సూర్యారావు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఆయ సంస్మరణ సభ ది యంగ్‌మెన్స్ హ్యాపీ క్లబ్ ఆధ్వర్యంలో జరిగింది. తొలుతగా సంస్థ ఉపాధ్యక్షులు సీతారామ్, ముంజులూరి విశ్వేశ్వరరావు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం క్లబ్ కార్యదర్శులు పివి.రావు, ప్రభుదాస్, కె.కృష్ణారావు, విశ్వేశ్వరరావు, బుర్రా పద్మనాభంలు నాటక, కళా రంగాలకు సూర్యారావు చేసిన విశిష్ట సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కె.అమీర్, పి.రామకృష్ణ, మార్ని జానకిరామచౌదరి, కాటంరెడ్డి చంద్రశేఖర్, సురేంద్రరాజు, అయ్యగారి వెంకటేష్, ఎంవి.రమణ, మహేష్, తురగా సూర్యారావు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక శ్రీరాం నగర్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చేతికి అందే ఎత్తులో ఏర్పాటు చేశారు. దీంతో అటుగా ప్రయాణించే వాహన దారులు భయభ్రాంతులకు గురవు తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ కేబుళ్ళు పక్కనే ఉన్న ఇంటి గోడకు అతి దగ్గరలో ఉండటంతో ప్రమాదం జరిగే అవకాశం ఉందని పలువురు వాపోతున్నారు. విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేసేందుకు ముందుగా ఎత్తుగా గోడ నిర్మించాల్సివుంది. దాని చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాల్సివుంది. అవి ఏమి లేకుం డా కేవలం విద్యుత్ స్తంభానికి ఇనుప కడ్డీలా ఏర్పా టు చేసి దానిపై ఏర్పాటు ట్రాన్స్‌ఫార్మర్‌ను చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ కల్పించాలని పలువురు కోరుతున్నారు.

చేతికి అందే ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

తిరుమాలిలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

మండలంలోని తిరుమాలి గ్రామంలో స్పార్క్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ ఆదిత్య సుమారు 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి రూ.30 వేలు విలువ చేసే మందులు అందజేశారు. ఈ సందర్భంగా స్పార్క్ ఫౌండేషన్ ఛైర్మన్ సాయి సందీప్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మానవ శరీరంలో అత్యంత ముఖ్యమైన కళ్ళను నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సూది వీరకృష్ణ ప్రసాద్, స్థానిక నాయకులు కోరుకొండ నూకరాజు, పసల సూరిబాబు, కూరాకుల నాగరాజు, స్పార్క్ సంస్థ ఇన్‌ఛార్జ్ రవికిరణ్, కోఆర్డినేటర్ సాహుల్, నవనీత్ నాగసాయి, కామేష్ పాల్గొన్నారు.

క్విజ్‌లో బహుమతులు అందుకున్న విద్యార్థులు

విద్యార్థులకు క్విజ్ పోటీలు

ప్రజాశక్తి - కరప

జన విజ్ఞాన వేదిక జిల్లా శాఖ ఆధ్వర్యంలో జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా వేళంగి మెర్లస్ జడ్‌పి ఉన్నత పాఠశాలలో క్విజ్ పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈ పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా ఉన్న పలు ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలకు చెందిన విద్యార్థులు సుమారు 400 మంది వరకూ పాల్గొన్నారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులను అందజేశారు. జెవివి జిల్లా అధ్యక్షులు కెఎంఎంఆర్.ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ బొండా వెంకన్నరావు, కాదా వెంకటరమణ, మెర్ల వీరయ్యచౌదరి, తోటకూర సాయిరాంకృష్ణ, ఎంఇఒ కెవి.కృష్ణవేణి, పి.సత్యనారాయణ, ఎవికె.రామాచార్యులు, వివిఎస్ రెడ్డి పాఠశాల హెచ్‌ఎం భారతి, సైకాలజిస్ట్ డాక్టర్ వరప్రసాద్ పాల్గొన్నారు.

గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీకాంత్‌కు ఘన సత్కారం

ప్రజాశక్తి - సామర్లకోట

రాష్ట్ర గౌడ వెల్ఫేర్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ బడుగు శ్రీకాంత్‌కు ఘన సత్కారం జరిగింది. ఆదివారం అయోధ్యరామపురం ప్రజలు ఏర్పాటు చేసిన ఆత్మీయ సత్కారం ప్రముఖ సిద్దాంతి చీమలకొండ ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభిమానులు, స్థానికుల సత్కారంతో తన బాధ్యత మరింత పెరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో పారిశ్రామిక వేత్తలు పెనుబోతుల సత్యనారాయణ, బిక్కిన సాయి, పి.ప్రకాష్, పట్టణ టిడిపి అధ్యక్షులు అడబాల కుమారస్వామి, మున్సిపల్ కౌన్సిలర్లు బలుసు వాసు, గొర్రెల విజయలక్ష్మీ, కాకినాడ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కొర్లమండ వీరభద్రరావు, శ్రీవాణి దంపతులు, మల్లిపూడి గంగాధర్, మల్లిపూడి వాసు. అయోధ్యరామపురం వాసులు పాల్గొన్నారు.

శ్రీకాంత్‌ను సత్కరిస్తున్న కాలనీవాసులు

అస్తవ్యస్తంగా సర్వీస్ రోడ్డు

ప్రజాశక్తి - తాళ్లరేవు

సుంకరపాలెం బైపాస్ జంక్షన్‌లోని కుడివైపు సర్వీస్ రోడ్డు అస్తవ్యస్తంగా మారింది. ప్రయాణికుల సౌకర్యార్థం చేపట్టిన సర్వీస్ రోడ్డులోకి బైపాస్‌కి పక్కన ఉన్న డ్రెయినేజీతోపాటు, ఆ ప్రాంతంలోని దుకాణ దారులు, హోటళ్ళ నుంచి వచ్చిన మురికి నీరు సైతం వస్తుంది. జాతీయ రహదారి 216పై ప్రయాణించే వాహనాలు సర్వీస్ రోడ్లో నిలుపుకుని ఆ ప్రాంతంలో పనులు చక్కబెట్టుకునే వాహన చోదకులకు ఈ రోడ్డు గతంలో ఉపయోగపడేది. ఇటీవల ఈ రహదారి అస్తవ్యస్తంగా తయారవడంతో అందరికీ ఇబ్బందిగా మారింది. దీనికి తోడు కొందరు దుకాణదారులు దుకాణానికి ప్రజలు వచ్చేందుకు వీలుగా దుకాణం ఎదురుగా పలుచోట్ల రబ్బిష్‌తో ఎత్తు చేయడంతో ఎక్కడి మురుగునీరు అక్కడే నిలిచిపోతుంది. యానం, సుంకరపాలెం రెండు ప్రాంతాలకు సంబంధించిన రహదారి కావడంతో ఎవరు పట్టించుకోక ఈ సర్వీస్ రోడ్డు దుర్వాసన వెదజల్లుతుంది. ఈ సర్వీస్ రోడ్ పక్కనే ఉన్న డ్రెయినేజీ ఎత్తుగా ఉండడం వల్ల ప్రస్తుత అవసరాల మేరకు సర్వీస్ రోడ్డు ఎత్తు చేయాల్సిన అవసరం కూడా ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి ప్రజలకు సర్వీస్ రోడ్డు ఉపయోగకరంగా ఉండేలా యానాం మున్సిపాలిటీ, సుంకరపాలెం పంచాయతీ సంయుక్తంగా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

మురుగునీటితో నిండిపోయిన సర్వీసు రోడ్డు

తునిలో కొవ్వొత్తులు వెలిగించి నిరసన వ్యక్తం చేస్తున్న అంబేద్కర్‌వాదులు

అమిత్‌షా వ్యాఖ్యలపై కొవ్వొత్తులతో నిరసన

ప్రజాశక్తి - కోటనందూరు, తాళ్లరేవు

రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షాను మంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం రాత్రి తుని పట్టణంలో కొవ్వొత్తులు వెలిగించి నిరసన ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని వీరవరపు పేట, కొండవారి పేటకు చెందిన అంబేద్కర్ అభిమానులు ఈ నిరసన ర్యాలీని నిర్వహించారు. అమిత్ షా వ్యాఖ్యలు అంబేద్కర్ వాదుల యొక్క మనోభావాలను దెబ్బతీశాయని అన్నారు. అమిత్ షాకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీగా గొల్ల అప్పారావు సెంటర్‌కు వచ్చి మానవహారం నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో బోడపాటి సతీష్, జల్లు సత్యనారాయణ, లంక కృపానందం, నాని ,రామ లక్ష్మణ్, గారా శ్రీను, తదితరులు పాల్గొన్నారు. తాళ్లరేవులో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాను మంత్రి పదవి నుంచి తొలగించాలని విశ్వజన కళామండలి రాష్ట్ర అధ్యక్షులు వడ్డి ఏడుకొండలు ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని రద్దు చేసి మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేసేందుకే మత అహంకారంతో బిజెపి నేతలు రెచ్చిపోతున్నారని అన్నారు. బిజెపికి దేశంపైన గౌరవం లేదని ఆయన మండిపడ్డారు. నేడు బడుగు, బలహీన వర్గాలు స్వేచ్ఛగా జీవించగలుగుతున్నారంటే అంబేద్కర్ వల్లనే అని అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ తక్షణమే స్పందించి అమిత్ షాను హోం మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలన్నారు. అమిత్ షా దేశ ప్రజలందరికీ బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

విద్యార్థినికి ప్రథమ బహుమతి

ప్రజాశక్తి - సామర్లకోట

జనవిజ్ఞాన వేదిక ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా స్థాయిలో నిర్వహించిన జాతీయ గణిత పోటీల్లో స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థిని వి.చాందిని మోనో యాక్షన్ పోటీల్లో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. క్విజ్ పోటీల్లో టి.హరిణి తృతీయ స్థానాన్ని సాధించింది. వీరికి జెవివి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కెఎంఎంఆర్.ప్రసాద్, వి.రామారావు జ్ఞాపికలు, ప్రశంస పత్రాలు వెలంగి హైస్కూల్‌లో జరిగిన జాతీయ గణిత దినోత్సవ వేడుకల్లో అందచేశారు. జిల్లాస్థాయిలో ప్రతిభ చూపించిన విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన గైడ్ టీచర్లు కె.అరుణ, డివిఆర్ఎన్.వల్లిలను పాఠశాల హెచ్‌ఎం తోటకూర సాయిరామకృష్ణ, తదితరులు అభినందించారు.

విజేతను అభినందిస్తున్న హెచ్‌ఎం

పివి.రావుకు ఘన నివాళి

ప్రజాశక్తి - కరప

స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షులు పివి.రావు వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అంబేద్కర్ యువజన సేవా సంఘం గౌరవ అధ్యక్షులు ఊబా ఏడుకొండలు మాట్లాడుతూ దళితుల ఐక్యత కోసం పోరాడి చివరికి ఆయన ప్రాణాలనే అర్పించిన మానవతావాది, పోరాట యోధుడు పివి.రావు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సేవా సంఘాల నాయకులు, మాల మహానాడు నాయకులు జెల్లా శివకుమార్, మొసలి శ్యామ్, పోలినాటి లక్ష్మణ్, పాల్గొన్నారు.

మహిళలకు చీరల పంపిణీ

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలోని పెదబ్రహ్మదేవం శారదా రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం మహిళలకు చీరల పంపిణీ చేశారు. లక్ష్మీ కళ్యాణ్ ఎంటర్ ప్రైజెస్ అధినేత చండువోలు వీర వెంకట సత్యనారాయణ ఈ కార్యక్రమంలో పాల్గొని చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు తోటకూర గంగాధర్, సమితి ఉపాధ్యక్షుడు నువ్వుల వెంకటరాజు, సభ్యులు నువ్వుల బాబ్జీ, సూర్య చంద్రరావు, మండవిల్లి వెంకట్రావు, సామర్లకోట మండలం ఎరువులు పురుగుమందులు డీలర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మండవిల్లి వెంకట్రావు, తెలుగుంట్ల నరసింహారావు, తాడాల దొరబాబు, తోటకూర శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహిళలకు చీరలు అందిస్తున్న నిర్వాహకులు

బాలాజీ సెంటర్‌లో భారీ అన్నదానం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

స్థానిక బాలాజీ చౌక్ సెంటర్లో ఆంజనేయ జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం భారీ అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు గత 30 సంవత్సరాలుగా ఆంజనేయ జయంతి సందర్భంగా మహాన్నదాన కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కంచర్ల సత్తిబాబు, గ్రంధి కృష్ణ, పిరాట్ల రాజా, రాపాక రామలింగేశ్వరరావు, మండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

భోజనాలు చేస్తున్న యాత్రికులు

ఘనంగా దంటు సూర్యారావు జయంతి

ప్రజాశక్తి - కాకినాడ

ది యంగ్‌మెన్స్ హ్యాపీ క్లబ్ పూర్వ అధ్యక్షులు, దంటు కళాక్షేత్రం వ్యవస్థాపకులు దంటు సూర్యారావు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఆయ సంస్మరణ సభ ది యంగ్‌మెన్స్ హ్యాపీ క్లబ్ ఆధ్వర్యంలో జరిగింది. తొలుతగా సంస్థ ఉపాధ్యక్షులు సీతారామ్, ముంజులూరి విశ్వేశ్వరరావు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం క్లబ్ కార్యదర్శులు పివి.రావు, ప్రభుదాస్, కె.కృష్ణారావు, విశ్వేశ్వరరావు, బుర్రా పద్మనాభంలు నాటక, కళా రంగాలకు సూర్యారావు చేసిన విశిష్ట సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కె.అమీర్, పి.రామకృష్ణ, మార్ని జానకిరామచౌదరి, కాటంరెడ్డి చంద్రశేఖర్, సురేంద్రరాజు, అయ్యగారి వెంకటేష్, ఎంవి.రమణ, మహేష్, తురగా సూర్యారావు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న క్లబ్ ప్రతినిధులు